# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

9

**మధ్యాహ్నం చలీ ఎండా కలిసి** వాతావరణం హాయిగా వుంటే, సమీర యూనివర్సిటీలోనే ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ నడక ప్రారంభించింది.

నిక్ ఏమయినాడు?

అదే ఆమెలో వున్న మిలియన్ డాలర్ల ప్రశ్న.

ఆదివారంనాడు ఎపార్ట్మెంటుకి వచ్చినప్పుడు కలవటమే!

మళ్ళీ సోమవారం, మంగళవారం, బుధవారం అంతులేదు.

తను ఎన్నిసార్లు పిలిచినా ఫోన్ తీయటం లేదు.

మెసేజ్ పెడితే, కనీసం జవాబు కూడా ఇవ్వటం లేదు. ఎందుకని?

తను అతన్ని నొప్పించే విధంగా ఏమీ మాట్లాడలేదే!

పోనీ చాల బిజీగా వున్నాడేమో? బిజీగా వుంటానని చెప్పాడు కదా! చెప్పాడుగానీ, కనీసం ఐదు నిమిషాలు కూడా సమయం దొరకనంత బిజీగా వుంటాడా? బిజీగా వుండి పిలవలేదు అనేది ఒక పెద్ద కుంటిసాకు. అలా అనటం నిజం కాదనేది జగమెరిగిన సత్యం. అందరికీ తెలిసినదే!

ఏదో తన కజిన్ అడిగాడు, అడిగిన సహాయం పూర్తి చేశాడు, అదవగానే అతని జీవితంలోకి అతను వెళ్ళిపోయాడు అని అనుకోవటానికి తన మనసు అంగీకరించటం లేదు.

ఎంతో స్నేహపూరితంగా ప్రవర్తిస్తూ, కలిసిన మొదటిసారే తనని ఆకట్టుకున్న నిక్ అలా అంతర్ధానం అయిపోతాడంటే అర్థం లేదు.

ఏదయినా రోడ్డు ప్రమాదమో, ఇంకా ఏదో అయిందేమో? అలా అయితే బాబ్, జెస్సికాలకి తెలిసే వుంటుంది. జెస్సిగా తప్పక తనని పిలిచేదే!

తను జీవిత సత్యాన్వేషణకి వెడుతున్నాను అన్నాడు. ఇతనేమైనా గౌతమ బుద్ధుడా అలా జీవన సత్యాలని శోధించి, సాధించటానికి?

అప్పుడే అక్కడే వున్న ఒక కొలను ఒడ్డున కూర్చుని, నీటిలో ఆడుకుంటున్న మూడు బాతులను చూస్తూ, తన లోకంలో తను ఏదో దీర్ఘాలోచనలో వున్న అశోక్ కనపడ్డాడు సమీరకి.

అతనికి దగ్గరగా వెళ్ళి, "అశోక్, బాగున్నారా? ఏమిటి బాతులతో మాట్లాడుతున్నారా?" అని అడిగింది సమీర చిరునవ్వుతో.

తన ఆలోచనలోనించీ తేరుకుని, ఆమె మాటలకు నవ్వాడు. "అదేమీ లేదు. నాకు బాతు భాష రాదుగదా! నాకు ఒక గంట ఖాళీ సమయం వుంది. ఆ రీసెర్చి వాతావరణంనించీ కాసేపు బయట ప్రశాంతంగా గడుపుదామని ఇలా వచ్చాను" అన్నాడు.

"సారీ, అలా అయితే మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నానేమో. ఊరికే తోచక అలా నడుస్తూ మీరిక్కడ కనపడితే ఆగాను" అంది సమీర.

"ఫరవాలేదు కూర్చోండి. నేను నా కొత్త ప్రాజెక్టు వివరాలు ఆలోచిస్తూ కూర్చున్నాను. అంతే" అన్నాడు అశోక్.

"మీరు మొన్న అన్నారు, సాంస్కృతిక మానవ శాస్త్రం గురించి తర్వాత చెబుతానని" అంది సమీర అక్కడే అతని ప్రక్కన కూర్చుంటూ.

అతను నవ్వి, "అది చాల పెద్ద సబ్జెక్ట్. చెప్పటం మొదలుపెడితే టీవీ సీరియల్లాగ అలా పోతూనే వుంటుంది. అందుకని ముందుగా నా ప్రాజెక్ట్ గురించి చెబితే చాలు, మీకు అంతా అర్థమైపోతుంది"

"పోనీ అదే చెప్పండి. నాకూ ఇంకా ఒక గంట సమయం వుంది" అన్నది సమీర.

ఒక్క క్షణం ఆగి సాలోచనగా అన్నాడు అశోక్.

"ఇక్కడ నేను మరో ఇద్దరితో కలిసి చేస్తున్న ప్రాజెక్ట్ క్లుప్తంగా చెబుతాను. 'ఏ సంస్కృతిలోనైనా అక్కడ పాటించే మతం లేదా మతాల పాత్ర ఎంత వరకూ వుంటుంది' అని"

"ఈ విషయంలో మీ ఉద్దేశ్యం ఏమిటి?" అడిగింది సమీర.

"ఇక్కడ ఉద్దేశ్యాలతో పనిలేదు. అంతా సమాచార సేకరణ, దాని పరిశీలన, కొంత పరిశోధన" అన్నాడు.

“బాగుంది. నాకూ ఎప్పటినించో వున్న ప్రశ్నే ఇది. మీరు ఇంకో ఇద్దరితో కలిసి పని చేస్తున్నాను అన్నారు కదా. మీ ముగ్గురి అభిప్రాయాలు వేరువేరుగా, అంటే పూర్తిగా విభిన్నంగా వుంటే?” అడిగింది సమీర.

అశోక్ నవ్వాడు. “వేరువేరుగానే వున్నాయి. మంచి ఫలితాలు కావాలంటే ఆ భిన్నత్వమే బాగా వుపయోగపడుతుంది. అందుకే కాబోలు వివిధ సంస్కృతులకూ, మతాలకూ సంబంధించిన వారికి ఈ ప్రాజెక్ట్ ఇచ్చారు. నేను హిందువుని. భారతీయ సంస్కృతి నాది. మోక్రీ ఇరానియన్. అతనిది ఇస్లాం మతం. ఆలిసన్ ఇక్కడే పుట్టిన ఆంగ్లో, క్రిస్టియన్. ఏ మతాన్నీ, దేవుడినీ నమ్మడు మా ప్రొఫెసర్. ఆయన ఎథియిస్టు” అన్నాడు.

పెద్దగా నవ్వింది సమీర. “ఇలాటి కాంబినేషన్ టీముతో మీ ప్రాజెక్ట్ ఇక ముందుకెలా పోతుంది?” అడిగింది.

అశోక్ నవ్వలేదు. నెమ్మదిగా అన్నాడు.

“ఇందాక చెప్పానుగదా! ఇలాటి టీముతోనే మనం అనుకున్న ఫలితాలు సాధించవచ్చు. డైవర్స్ ఒపీనియన్స్ అంటామే, అది. వివిధ అభిప్రాయాల కలయిక. వాటిలో ఎన్నో బేధాభిప్రాయాలు కూడా వుంటాయి. వుండాలి. అలా అయితేనే మనం అనుకున్న ఫలితం రాబట్టవచ్చు. ఒకరు అన్నదానికి మిగతావాళ్ళు ప్రతిదానికీ అర్థం లేకుండా బుర్రలు వూపుతుంటేనే ఆ ప్రాజెక్ట్ సరిగ్గా ముందుకు వెళ్ళే అవకాశం తక్కువ అని నా నమ్మకం. మా ప్రొఫెసర్ నమ్మకం కూడా అదే. అందుకే ఇలాటి టీముని ఈ ప్రాజెక్టుకి సిద్ధం చేశాడు”

“మరి అడ్డంకులని ఎలా ఎదుర్కొంటారు? మరి అమెరికాలో conflict management అంటుంటారే, దాన్ని ఇలాటి విషయాల్లో ఎలా వాడతారు?” అడిగింది సమీర.

“ఈ విషయంలోనే కాదు, మన స్వంత విషయాలతో సహా ఏ విషయంలోనైనా సరే, అది ఒకే విధంగా వాడతాం కదా! ఇదీ అలాగే. నేను ఇదే విషయం మీద ఒక సెమినారుకి కూడా వెళ్ళాను. చాల సులభమైన ఉదాహరణ ఏమిటంటే ఒక భార్యా, భర్తా చాల గట్టిగానే వాదించుకుని చాల ఇబ్బందుల్లో పడ్డారనుకుందాం. ఆ వివాహబంధం తెంచుకునేదాకా వచ్చిందనుకుందాం. ఐదే ఐదు అంచెలలో దీన్ని శాస్త్రయుక్తంగానే పరిష్కరించుకోవచ్చు అని నేను చదువుకున్నాను. ముందుగా రెండు పార్టీలవారూ, ఈ విషయంలో భార్యా భర్తా, ఏ ఉద్రిక్తతకూ లోనుకాకుండా తీరిగ్గా మనసు విప్పి మాట్లాడుకోవటం అవసరం. రెండవది ఒకళ్ళు మాట్లాడే సమయంలో రెండవవారు దీక్షగా, ఏమీ వాదించకుండా వినటం. మూడవది ఇలాటి సమస్యలకు ఎన్ని, ఎలాటి పరిష్కార మార్గాలు వున్నాయో వ్రాసుకోవటం. నాలుగవది ఆ పరిష్కారాల్లో చాల ముఖ్యమైనది, లేదా ముఖ్యమైనవి తీసుకుని, వాటిని అమలుపరచటానికి ఎవరెవరు ఎలా తమ ప్రవర్తనని మార్చుకోవాలో నిర్ణయం చేసుకోవటం. ఐదవది వాటిని పూర్తిగా అమలు పరచటం. అంతే!”

“చెప్పటానికి బాగానే వుంది కానీ, నిజంగా ఇలాటి వాటికన్నిటికీ పరిష్కారాలు దొరుకుతాయని నేనకోను. మీరు చెప్పిన కేసునే తీసుకుంటే, వారిలో అభిప్రాయబేధాలు చాల ఉధృతంగా వుంటే, ఇద్దరూ ఒక పరిష్కారం దాకా రావటం

కష్టం. కేవలం మాట్లాడుకోవటంతో వారి సమస్య సమసిపోతుంది అనుకోవటం సెమినార్లలో వినటానికి బాగుంటుంది కానీ నిజజీవితంలో అంత సులభం కాదు అని నా అభిప్రాయం" అంది సమీర.

"అలాటి క్లిష్ట సమస్యల్లో, నేను తీసుకున్న కోర్సులో వాళ్ళు చెప్పేదేమంటే, అలాటప్పుడు ఒక మూడవ వ్యక్తిని ఈ సంభాషణలు నడిచేటప్పుడు మధ్యవర్తిగా పెట్టుకోవటం. అంటే ఫెసిలిటేటర్లా పెట్టుకోవటం. ఇండియాలో అయితే, ఆ రోజుల్లో ఆ మధ్యవర్తి ఇలాటి విషయాల్లో రాజీ కుదిర్చే ఒక పెద్దమనిషి. సాధారణంగా వీరి కుటుంబాలకే చెందిన ఒక మామయ్యో, బాబాయో అవవచ్చు. లేదా బయట తెలిసినవారు కావచ్చు. ఈ రోజుల్లో అయితే, మీ అమెరికాలోనూ, ఇక్కడ ఇంగ్లండులోనూ, అక్కడ ఇండియాలో కూడా ఏ సైకాలజిస్టునో చూడటం కూడా చేస్తుంటారు"

నవ్వింది సమీర. "మరి ఇలాటి వివాహ సమస్యలు ఇంత సులభంగా తీరిపోతుంటే, మరి అన్ని దేశాల్లో ఇన్ని విడాకులు ఎందుకు జరుగుతున్నాయి? లాయర్ల బదులు కౌన్సిలర్లతో మాట్లాడి సులభంగానే రాజీ చేసుకోవచ్చు కదా? అసలు విడాకుల ప్రసక్తే అనవసరం కదా" అన్నది.

"అవును. అలా విడాకులు తీసుకోవచ్చు. కొన్ని కేసుల్లో విడాకులు అవసరం కూడాను. నేనేదో గృహహింస కేసుల గురించో, న్యాయ విరుద్ధమైన కేసుల గురించో మాట్లాడటం లేదు. వాటిలో మీరు చెప్పింది సమంజసమే. కానీ డెభై శాతం దాకా ఈ విడాకులు పరిష్కారాల పరిధిలో వున్నవే. ఇంకొక విషయం ఏమిటంటే, ఇళ్ళల్లోగానీ ఆఫీసుల్లోగానీ, ఎన్నో బేధాభిప్రాయాలకు కారణాలు, తమ భావాలను ఇంకొకరి పైన రుద్దటం. వివిధ అభిప్రాయాలను గౌరవించకపోవటం. తమ ఎదుటి వ్యక్తి తను అనుకున్నట్టుగానే వుండాలి, వేరేగా వుండకూడదు అనుకోవటం. ఒకరు తమ ఊహాలోకంలో వుండి, ఎదుటి వారు అలా అక్కడ లేకపోవటం చూసి వారికి దూరమవటం. ఇలా ఎన్నో చిన్న చిన్న కారణాలే. ఎదుటి వ్యక్తిని వారిలాగానే ప్రేమించటం నేర్చుకుంటే, ఇలాటి సమస్యలే వుండవు" అన్నాడు అశోక్.

సమీర ఒక్క క్షణం మాట్లాడలేదు. తేరుకుని అన్నది, "మీరు యాంత్రపాలజిస్టునన్నారు కానీ సైకాలజిస్టులా చెప్పారు. మనం ఇలా మాట్లాడుకుంటూ అసలు విషయం, మీ ప్రాజెక్ట్ విషయం, వదిలేసి వివాహ సమస్యల్లోకి వెళ్ళిపోయాం" అంటూ చిన్నగా నవ్వింది.

అశోక్ కూడా నవ్వి, "నాకు ఒక మీటింగ్ వుంది. వెళ్ళాలి. మళ్ళీ మాట్లాడుకుందాం" అన్నాడు.

సమీర చేతి గడియారం చూసుకుని, "అవును. నేనూ వెళ్ళాలి. మళ్ళీ కలుద్దాం" అంది లేస్తూ.

o o o

సాయంత్రం దాకా ఆఫీసులో పని చేస్తూనే వుందిగానీ, సమీర మనసు మనసులో లేదు.

చూడటానికి అశోక్ తన వయసువాడే అనుకోవచ్చుగానీ, అతని ఆలోచనలు మాత్రం అతని వయసుకి మించి వున్నాయనిపించింది సమీరకి.

తర్వాత మళ్ళీ అనుకుంది, అతనికి పెళ్ళి అయినట్టు చెప్పలేదు, మరి అలాటి బ్రహ్మచారికేం తెలుసు సంసారాల్లో విభేధాలు అని కూడా అనుకుంది.

అటూ, ఇటూ, ఎటో వెడుతున్న ఆలోచనలని పక్కకి నెట్టి, తను చేస్తున్న పని మీద దృష్టి పెట్టాలని ఎంత ప్రయత్నించినా కుదరటం లేదు సమీరకు.

ఇక లాభం లేదని ఆరోజుకిక పని చాలించి, తన ఎపార్ట్మెంటుకి వెళ్ళిపోయింది.

తల మీద స్నానం చేసి, ఫ్రిడ్జిలో వున్నదేదో తిని, ఎవరికి ఫోన్ చేయాలా అని ఆలోచిస్తుంటే ఫోన్ మ్రోగింది.

నిక్.

ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది.

తనకి తెలియకుండానే అసంకల్పితంగా ఫోన్ అందుకుంది.

"సమీరా, నేను. నిక్" అన్నాడు నిక్.

"హలో ఎక్కడినించీ? నాలుగు రోజులుగా కనపడలేదు. వినపడలేదు. నీకు మెసేజీలు కూడా పెట్టానే" అన్నది సమీర నిష్టూరంగా.

"ఇప్పుడే మెసేజీలన్నీ చూశాను. రైల్లో ఇంటికి వెడుతున్నాను. రేపు సాయంత్రం నువ్వు ఖాళీగా వుంటే నేను వస్తాను" అడిగాడు నిక్.

"ఎందుకు?" అని అడిగింది కొంచెం కోపంగా.

"ఎందుకేమిటి? నిన్ను కలవటానికి" అన్నాడు నిక్ నిర్మలంగా నవ్వుతూ.

మనసులో కోపం మాటల్లోకి వస్తుంటే, కొంచెం నిలదొక్కుకుని "ఒక్కసారి నా కేలండర్ చూడనీ... హోల్డాన్" అన్నది సమీర.

ఆమెకి వెంటనే సరే అనటానికి అభిమానం అడ్డం వచ్చింది.

'అతను అన్ని రోజులు జవాబు ఇవ్వకపోతే తనకి ఎంత కోపం వచ్చింది. ఇప్పుడేమో వస్తాడుట. నన్ను చూడటానికి' అనుకుంది.

రెండు నిమిషాలు కావాలనే మాట్లాడలేదు.

"సమీరా, నువ్వు లైన్లో వున్నావా లేక ఫోన్ కట్టయిందా" అని అడిగాడు నిక్ ఏమీ అర్ధంగాక.

'రేపు సాయంత్రం బిజీగా వుంటాను' అని చెబుదామనుకుందిగానీ, తీరా జవాబిచ్చే సమయానికి "లేదు, లైన్లోనే వున్నాను, నిక్. సరే, రేపు సాయంత్రం వచ్చేయి. కలుద్దాం" అంది.

"గుడ్. రేపు సాయంత్రం ఐదున్నరకి అక్కడికి వస్తాను. నేను దిగాల్సిన స్టేషన్ వచ్చింది. నేను దిగాలి. మళ్ళీ మాట్లాడదాం" అంటూ ఫోన్ పెట్టేశాడు.

తనేం చెబుదామనుకున్నది? ఏం చెప్పింది?

'నా మనసు నా స్వాధీనంలో లేదు' అనుకుంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments